

ఉపాధ్యాయులపై వేధింపులు మానుకోవాలి

ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉపాధ్యాయులపై విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఆయన లేఖ రాశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా శాఖ సమస్యలు పరిష్కారం చేయకుండా నిర్లక్ష్యం చేయడం వలన విద్యాశాఖలో అనేక సమస్యలు నెలకొన్నాయన్నారు. సమస్యలు పరిష్కరించకుండా ఉపాధ్యాయుల మనోభావాలు దెబ్బ తీసే విధంగా విద్యా శాఖ కార్యదర్శి వ్యవహరిస్తున్నారన్నారు. ఖాళీ ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయడం లేదన్నారు. ఉన్న ఉపాధ్యాయులపై పని భారం మోపి భయభ్రాంతులకు గురి చేయడం సరికాదన్నారు. బోధనేతర పనులు తగ్గించి ఉపాధ్యాయుల బోధనకు ఉపయోగించాలని పేర్కొన్నారు.

జిల్లాపై కేంద్రం నిర్లక్ష్యం

కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక బడ్జెట్ కేటాయింపుల్లో జిల్లాపై తీవ్ర వివక్ష ప్రదర్శిస్తోంది. జిల్లా అభివృద్ధికి తలమానికంగా భావిస్తున్న గిరిజన వర్శిటీ, భోగాపురం అంతర్జాతీయ ఎయిర్‌పోర్టులకు సహకరించడం లేదు. రాష్ట్ర విభజన సందర్భంగా ఇచ్చిన ప్రత్యేక హోదా మొదలుకుని ప్రత్యేక అభివృద్ధి నిధులకు కూడా ముఖం చాటేస్తోంది. దీనికితోడు 15వ ఆర్థిక సంఘం నిధులు కూడా సరిగా విడుదల చేయకపోవడం వల్ల స్థానిక సంస్థలు ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్నాయి. ఇటువంటి తరుణంలో ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టనున్న 2023-24 బడ్జెట్‌లోనైనా కేంద్రం న్యాయం చేస్తుందా? అన్న ఆశతో జిల్లా వాసులు ఎదురు చూస్తున్నారు.

సిటియు ఏర్పాటు కోసం భూములను పరిశీలిస్తున్న కేంద్రబృందం, జిల్లా ప్రజాప్రతినిధులు (ఫైల్)

- గిరిజన వర్సిటీకి ఏటా కంటితుడుపు కేటాయింపులు
- నిలిచిన అభివృద్ధి పనులు
- అమలుకు నోచుకోని విభజన హామీలు
- ఎయిర్‌పోర్టుకూ సహాయ నిరాకరణ
- రేపు కేంద్ర బడ్జెట్
- ఈసారైనా సహకరించేనా?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఐదేళ్లగా శాశ్వత భవన సముదాయం లేక అద్దె కొంపలో తరగతులు నిర్వహిస్తున్న గిరిజన వర్శిటీకి రూ.1200కోట్లు అవసరం కాగా, ఏటా రూ.22కోట్లకు మించి కేటాయించడం లేదు. ఈ నిధులు వర్శిటీ పరిపాలన, అధ్యాపకులు, సిబ్బంది జీతభత్యాలకే సరిపోతున్నాయి. మరోవైపు స్థల గుర్తింపు పేరుతో సుమారు రెండు దశాబ్దాలపాటు సాగదీసి, సేకరణ పేరుతో కాలక్షేపం చేస్తోంది. భోగాపురంలో తలపెట్టిన ఎయిర్‌పోర్టు నిర్మాణానికి ఆర్థికంగా సాయం చేయాలని కోరుతూ సిఎం జగన్మోహన్‌రెడ్డి నేరుగానూ, లిఖిత పూర్వకంగానూ కోరారు. ఇప్పటికీ స్పందన లేదు. ఇటీవల విశాఖ వచ్చిన ప్రధాని నరేంద్ర మోడీ భోగాపురం ఎయిర్‌పోర్టు, గిరిజన వర్శిటీ పనులకు శంకుస్థాపన చేస్తారని రాష్ట్ర ప్రభుత్వం ఆశించినా ఆదిశగా సహకరించలేదు. గ్రామీణాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నట్లు చెబుతూనే ఉపాధి హామీ చట్టానికి కేంద్రం తూట్లు పొడుస్తోంది. ఈ పథకం ఉపయోగించుకోవడంలో మన జిల్లా దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది. ఇటువంటి పథకంలో గత ఏడాది రూ.25వేల కోట్ల మేర బడ్జెట్ కేటాయింపు తగ్గించిన విషయం విధితమే. ఇందులో భాగంగా పెట్టిన నిబంధనల వల్ల ఏడాదిగా పనికి తగ్గవేతనాలు రావడం లేదని ఉపాధి కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాకు మంజూరవుతున్న మెటీరియల్ కాంపోనెంట్ నిధులు ఎప్పటికప్పుడు విడుదల చేయడం లేదు. ఏటా వందల కోట్ల వెనక్కిపోతున్నాయి. 2019-20, 2020-21 సంవత్సరాల్లో చేసిన పనికి తగట్టు నిధులు విడుదల చేయలేదు. సుమారు రూ.500కోట్ల వరకు బకాయి చెల్లించాల్సి ఉంది. దీంతో, ఆర్థిక ఇబ్బందుల్లో పడ్డ కాంట్రాక్టర్లు నిర్మాణాలపై ఆసక్తి చూపడం లేదు. 2020-21లో రూ.211కోట్లు, 2021-22 లో రూ.300కోట్లు చొప్పున కేంద్రం నుంచి రావాల్సిన నిధులు రద్దయ్యాయి. గత ఏడాది కూడా రూ.290కోట్లు వెనక్కి వెళ్లాయి. అభివృద్ధి, మౌలిక సదుపాయాలు కుంటుబడుతున్నాయి. జిల్లాకు మంజూరు కావాల్సిన ఎస్‌డిపి (స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్) నిధులు అక్కరకు చేరలేదు. విజయనగరం ఉమ్మడి జిల్లాకు 5ఏళ్లపాటు ఏటా రూ.50కోట్లు చొప్పున రూ.250కోట్లు మంజూరు చేయాల్సివుండగా విడుదల అరకొరగానే ఉన్నాయి. రూ.170కోట్ల విలువగల పనులు జరగ్గా, రూ.133.5కోట్లు మాత్రమే కేంద్రం విడుదల చేసింది. దీంతో, మిగిలిన రూ.36.5కోట్లు బకాయి ఉంది. రెండేళ్లగా చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు చాలా మంది పనులను అర్థాంతరంగా నిలిపివేశారు.

దశాబ్దాల క్రితం నుంచి మోడల్‌గా మారుస్తామన్న విజయనగరం రైల్వే స్టేషన్ ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగానే మిగిలింది. కనీసం పడమట దిక్కున మరిన్ని ప్లాట్‌ఫారాలు, ప్రయాణికుల రాకపోకలకు అనువుగా వంతెనలు నిర్మించాలన్న ప్రతిపాదన నెరవేరలేదు. వ్యవసాయ రంగానికి కేటాయిస్తున్న నిధులు అంకెలు గారడిగానే మిగలడంతో రైతులకు అందే సబ్సిడీ తగ్గిపోయాయి. రైతులు విరివిరిగా వినియోగిస్తున్న ఎరువులు, పురుగు మందులపై సబ్సిడీలు తగ్గించడం లేదా ఎత్తివేయడం వంటివి చేయడంతో పెట్టుబడి భారంగా మారింది. గత బడ్జెట్ సమావేశంలో క్రిమిసంహారక మందుల వినియోగానికి కిసాన్ డ్రోన్లు ప్రవేశపెడతామంటూ బడ్జెట్ ప్రసంగంలో ఊదరగొట్టినప్పటికీ వ్యవసాయ ఉత్పత్తుల సేకరణ, గిట్టుబాటు ధరలు, గొడౌన్లు ఏర్పాటు గురించి పట్టించుకోకపోవడంతో రైతులకు భద్రత లేకుండా పోయింది. ఏటా కోటి ఉద్యోగాలిస్తామన్న కేంద్ర గత రెండేళ్లలో ఎలాంటి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించలేదు. ఆదాయ పన్ను పరిమితి పెంచుతారని ఏటా ఎదురు చూస్తున్న ఉద్యోగులకు నిరాశే మిగులుతోంది. సర్వశిక్షాభియాన్, మధ్యాహ్న భోజన పథకం, ఐసిడిఎస్, జాతీయ ఆరోగ్య మిషన్ తదితర పథకాలకు నిధులు పెంచలేదు. కార్మికుల సంక్షేమ నిధిలో విధించిన కోత వల్ల వారికి ప్రభుత్వ సహకారం తగ్గింది. ఇన్సూరెన్స్ వంటి సదుపాయాలు అందని ద్రాక్షగానే మారాయి. పెట్రోల్, డీజిల్‌పై రాయితీలు లేకపోవడం వల్ల రైతులకు మరిన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతాయి. విభజన హామీలపై ఎలాంటి చర్చగానీ, కేటాయింపులుగానీ చేయడం లేదు. ఈ బడ్జెట్‌లోనైనా ఉపశమనం లభిస్తుందని అన్ని రంగాల ప్రజలూ ఎదురు చూస్తున్నారు.

ధాన్యం కొనాలని రైతుల ధర్నాలు

భోగాపురంలో ట్రాక్టర్లతో నిరసన

భోగాపురం తహశీల్దార్ కార్యాలయానికి ట్రాక్టర్లతో ధాన్యం బస్తాలను తీసుకొచ్చిన రైతులు

ప్రజాశక్తి- భోగాపురం, బొండపల్లి, గజపతినగరం, వంగర

తమ వద్ద ఉండిపోయిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎపి రైతు సంఘం ఆధ్వర్యాన జిల్లాలోని భోగాపురం తహశీల్దార్ కార్యాలయం, బొండపల్లి మండలం బి.రాజేరు, గజపతినగరం మండలం పాతబగ్గాం, వంగర మండలం కొప్పరవలస రైతు భరోసా కేంద్రాల వద్ద రైతులు సోమవారం ధర్నాలు చేశారు.

భోగాపురం రెవెన్యూ పరిధిలోని భోగాపురం, చాకివలస, జగ్గయ్యపేట, నందిగాం గ్రామాలకు చెందిన రైతులు తహశీల్దార్ కార్యాలయానికి ట్రాక్టర్లపై ధాన్యం బస్తాలు తీసుకెళ్లి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ వేలకు వేలు మదుపులు పెట్టి పంటలు పండిస్తే అమ్ముకునేందుకు ఇన్ని అవస్థలు పడాలా అంటూ ప్రశ్నించారు. కొనుగోలు చేసే విషయంలో ప్రభుత్వం తాత్సారం చేయడం సరికాదని అన్నారు. ప్రభుత్వం ప్రతి గింజ కొంటామని చెప్పినా 15 రోజులుగా ఆర్‌బికెలు, అధికారుల చుట్టూ తిరగాల్సి వస్తుందని రైతులు వాపోయారు. ఇంకా పొలాల్లో ఐదు వేల టన్నులు పంట ఉండిపోయిందని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గజపతినగరం మండలం పాతబగ్గాం రైతు భరోసా కేంద్రం వద్ద రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అనంతరం ఆర్‌బికెలో పనిచేస్తున్న కె.ప్రవీణ్ కుమార్‌కు వినతి అందజేశారు. కార్యక్రమంలో లెంక చిన్నంనాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గొర్లె శ్రీనివాస్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు, తెర్లాపు కృష్ణ, టి.రమణ, గంట్యాడ అప్పారావు, సూర్యనారాయణ, ఆదినారాయణ, కె.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

బొండపల్లి మండలం బి. రాజేరు ఆర్‌బికె వద్ద రైతులు పెద్దఎత్తున ధర్నా చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు మాట్లాడుతూ బి.రాజేరు, జిపి అగ్రహారం, చిన తామరాపల్లి గ్రామాల రైతుల వద్ద 529 మెట్రిక్ టన్నులు ధాన్యం ఉన్నట్లు యాప్‌లో అప్ లోడ్ చేశారని, కానీ కేవలం వంద టన్నులు మాత్రమే కొనుగోలు చేసేందుకు అనుమతులు వచ్చాయని తెలిపారు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. రైతుల వద్దనున్న ధాన్యమంతటినీ కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

వంగర మండలం కొప్పరవలస ఆర్‌బికె వద్ద రైతులు ధర్నా చేశారు. ఇ-క్రాప్ చేసుకున్న రైతులందరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సిఎస్‌డిటి బలివాడ గోవిందరావుకు వినతి అందజేశారు. కార్యక్రమంలో కొప్పరవలస, బంగారు వలస, రుషింగి గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

బొండపల్లి : ధర్నా చేస్తున్న రైతులు, రైతుసంఘం నాయకులు ; గజపతినగరం : ధర్నా చేస్తున్న రైతులు, వ్యకాస నాయకులు

గొర్రెలమందపైకి దూసుకెళ్లిన లారీ

60 గొర్రెలు మృతి

గొర్రెల కళేబరాలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే లలితకుమారి

ప్రజాశక్తి-కొత్తవలస

మండలంలోని అడ్డూరువానిపాలెం వద్ద అరకు - విశాఖ రోడ్డులో సోమవారం గొర్రెల మందపైకి లారీ దూసుకెళ్లింది. దీంతో 60 గొర్రెలు అక్కడికక్కడే మరణించాయి. మరికొన్ని గొర్రెలు గాయపడ్డాయి. స్థానికుల కథనం ప్రకారం..

లక్కవరపుకోట మండలం కిత్తన్నపేట గ్రామానికి చెందిన దుక్క గంగునాయుడు తన గొర్రెల మందను అనకాపల్లి నుంచి స్వగ్రామానికి తోలుకొని వెళ్తున్నాడు. లక్కవరపుకోట వైపు నుంచి విశాఖకు వెళుతున్న లారీ డ్రైవర్ నిద్రమత్తులో ఉండటంతో ఒక్కసారిగా గొర్రెల మందపైకి దూసుకెళ్లింది. ఘటనా స్థలంలో గొర్రెల కళేబరాలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. అక్కడికక్కడే 60 గొర్రెలు మృత్యువాతపడ్డాయి. మరికొన్ని గొర్రెలు తీవ్ర గాయాల పాలయ్యాయి. లారీని ఘటన స్థలంలో విడిచిపెట్టి డ్రైవర్ పరారయ్యాడు. కేసు నమోదు చేసినట్లు కొత్తవలస పోలీసులు తెలిపారు.

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే

ప్రమాద సమాచారం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఎలా జరిగిందని ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే నష్టపోయిన కాపరికి పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిడిపి బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి కోళ్ల వెంకటరమణ, విశాఖ పార్లమెంట్ ఉపాధ్యక్షులు బొబ్బిలి అప్పారావు, మాజీ ఎంపిపి కొల్లు వెంకటరమణమూర్తి, మాజీ జెడ్‌పిటిసి కరెడ్ల ఈశ్వరరావు, మాజీ ఎంపిటిసి మల్ల రామకృష్ణ, సీనియర్ నాయకులు గొంప దుర్గా ఉమేష్, వర్రి రాము పాల్గొన్నారు.

పేదల ఆర్థిక అభ్యున్నతే లక్ష్యం

జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు • 'చేదోడు'తో 17 వేల మందికి రూ.17 కోట్ల లబ్ధి

చెక్కు అందజేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, జెడ్‌పి ఛైర్మన్ మజ్జి

ప్రజాశక్తి-విజయనగరం

పేద ప్రజల సంక్షేమం.. ఆర్థిక అభ్యున్నతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పేర్కొన్నారు. జగనన్న చేదోడు పథకం మూడో విడత నిధుల విడుదల కార్యక్రమానికి హాజరైన ఆయన మీడియాతో మాట్లాడారు. కులవృత్తే ప్రధానంగా జీవనం సాగించే నాయీ బ్రాహ్మణులకు, దర్జీలకు, రజకులకు ఒక్కొక్కరికీ రూ.10 వేల చొప్పున అందిస్తూ రాష్ట్ర ప్రభుత్వం వారికి అండగా నిలుస్తోందని అన్నారు. ఈ నిధులను వినియోగించుకోవటం ద్వారా ఆయా వర్గాల వారు మరింత ఆర్థిక పురోగతి సాధించాలని ఆకాంక్షించారు.

జగనన్న చేదోడు పథకం మూడో విడత నిధుల పంపిణీ కార్యక్రమాన్నిముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పల్నాడు జిల్లా వినుకొండ నుంచి సోమవారం ప్రారంభించారు. ప్రసంగం అనంతరం మీట నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా నిధులను జమ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ సురేష్ బాబు, కలెక్టర్ సూర్యకుమారి, స్థానిక మేయర్ వెంపడాపు విజయలక్ష్మి స్థానిక కలెక్టరేట్ నుంచి పాల్గొన్నారు.

17,245 మందికి రూ.17.245 కోట్ల ఆర్థిక ప్రయోజనం

జగనన్న చేదోడు పథకం మూడో విడత నిధుల విడుదలలో భాగంగా జిల్లా నుంచి 17,245 మంది లబ్ధి పొందారని జిల్లా కలెక్టర్ ఎ. సూర్యకుమారి వివరించారు. ఒక్కొక్క లబ్ధిదారునికి రూ.10 వేల చొప్పున మొత్తం రూ.17.245 కోట్లను వారి ఖాతాల్లో జమ చేసినట్లు పేర్కొన్నారు. చేదోడు పథకం జిల్లాలో మొదటి విడతలో భాగంగా16,359 మందికి రూ.16.359 కోట్లు, రెండో విడతలో 13,331 మందికి రూ.13.331 కోట్లు, మూడో విడతలో 17,245 మందికి రూ.17.245 కోట్లు అందజేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. కార్యక్రమంలో భాగంగా రూ.17.245 కోట్ల విలువ గల మెగా చెక్కును డిప్యూటీ స్పీకర్, జెడ్‌పి ఛైర్మన్, కలెక్టర్, మేయర్ చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు.

'ముఖ హాజరు'ను రద్దు చేయాలని ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మున్సిపల్ కార్మికులకు ముఖ హాజరు విధానాన్ని రద్దు చేయాలని సిఐటియు, ఎఐటియుసి నాయకులు ఎ.జగన్మోహన్, ఎస్.రంగరాజు డిమాండ్ చేశారు. రెండు సంఘాల అధ్వర్యంలో ఎదుట కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ హాజరుతో జీతాలకు ముడి పెట్టడంతో కార్మిక వ్యతిరేకిగా జగన్ పాలన మిగిలి పోతుందన్నారు. తరతరాలుగా పారిశుధ్య కార్మికులుగా పని చేస్తూ వస్తున్నారని, అత్యధిక శాతం మంది కార్మికులు నిరక్షరాస్యత గల వారని,ఫోన్లు వాడటం తెలియని వారేనని, అటువంటి వారిపై ముఖ హాజరు విధానం అమలు చేసి, నిరంకుశ విధానానికి పూనుకోవడం దుర్మార్గపు చర్యని అన్నారు. తక్షణమే జగన్ ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని, మృతి చెందిన, రిటైర్ అయిన కార్మికుల కుటుంబాల్లో ఒకరికి పని కల్పించాలని, బకాయిలు, చెల్లించాలని, సచివాలయాల పరిధిలో పని ఒత్తిడి తగ్గించి అధికారులు కార్మికులను బ్లాక్ మెయిల్ చేసే పద్ధతిని మానుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రెండు సంఘాల నాయకులు జి.కుమారి, ఆదిలక్ష్మి, నాగలక్ష్మి, పైడిరాజు, ఉమ, కామేష్, తదితరులు పాల్గొన్నారు.

డిఆర్‌సి సమావేశం వాయిదా

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించాల్సిన జిల్లా సమీక్ష సమావేశం వాయిదా పడినట్లు కలెక్టర్ సూర్యకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సూచనల మేరకు వాయిదా వేస్తూ నిర్ణయించినట్లు వెల్లడించారు. సమావేశం జరిగే తదుపరి తేదీని తర్వాత ప్రకటిస్తామని పేర్కొన్నారు.

మతసామరస్యాన్ని కాపాడుకుందాం

గాంధీజీ వర్థంతి సందర్భంగా అంగన్వాడీల ప్రతిజ్ఞ

గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మత సామరస్యాన్ని కాపాడాలంటూ గాంధీ వర్ధంతి సందర్భంగా ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం ప్రతిజ్ఞ చేశారు. తొలుత గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు నగర అధ్యక్షులు ఎ.జగన్మోహన్, సెక్టార్ నాయకులు లలిత మాట్లాడుతూ జాతిపిత మహాత్మా గాంధీని నాథూరాం గాడ్సే హత్య చేసి 75 సంవత్సరాలు కావస్తోందన్నారు. మత సామరస్యాన్ని కోరుతూ, హిందూ ముస్లిం భాయ్ భాయ్ అంటూ మహాత్మా గాంధీ నిర్వహించిన ప్రచార ఉద్యమాన్ని ఓర్వలేక ఆర్‌ఎస్‌ఎస్‌కు చెందిన గాడ్సే గాంధీని హత్య చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. గాంధీజీ నీ చంపిన గాడ్సే విగ్రహాన్ని పార్లమెంట్లో ప్రతిష్ఠించడమంటే ఇంతకంటే మరొక దేశ ద్రోహం లేదన్నారు. మతసామరస్యాన్ని కాపాడుకోవడమే మహాత్మా గాంధీకి మనం ఇచ్చే ఘనమైన నివాళి అన్నారు. కార్యక్రమంలో మంగ,శ్రీదేవి, రోహిణి, తదితరులు పాల్గొన్నారు.

6న అంగన్‌వాడీల మాస్‌లీవ్

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఫిబ్రవరి 6న జిల్లా వ్యాప్తంగా మాస్ లీవ్ పెట్టి కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తామని ఎపి అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.పైడిరాజు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ తెలిపారు. సోమవారం ఐసిడిఎస్ పీడీని కలిసి వినతి సమర్పించారు. ఫేస్ యాప్ రద్దు చేయాలని, పర్యవేక్షణ పేరుతో వేధింపులు ఆపాలని, మెస్ ఛార్జీలు పెంచి, గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని, 2017 నుంచి బకాయి ఉన్న టిఎ బిల్లులు చెల్లించాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యూటీ, రిటైర్మెంట్ బెన్ ఫిట్స్ ఇవ్వాలని, వేతనంతో కూడిన మెడికల్ సెలవులు ఇవ్వాలని, పదోన్నతుల్లో వయో పరిమితి సడలించాలని డిమాండ్‌తో ఆందోళన చేపడుతున్నామని తెలిపారు. వినతి అందించిన వారిలో యూనియన్ నాయకులు కె.ప్రభావతి, విశాలాక్షి, శీవలక్ష్మి, కార్మికులు పాల్గొన్నారు.

లోకేష్ వ్యాఖ్యలు రాజకీయ లబ్ధి కోసమే

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాజకీయ లబ్ధికోసం లోకేష్ వైసిపి ప్రభుత్వంపై అవాస్తవలు చెబుతున్నారని, ఎన్ని పాదయాత్రలు చేసినా అధికారంలోకి టిడిపి రావడం జరగదని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. సోమవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాదయాత్రలో వాస్తవాలు మాట్లాడాలని హితవు పలికారు. 25వేలు కిలోమీటర్ల సిసి రోడ్లు, 5లక్షలు ఉద్యోగాలు, ఎల్ఇడి బల్బులు అన్ని గ్రామాల్లోనూ వేస్తే 2019 ఎన్నికల్లో ప్రజలు ఎందుకు ఓడించారని ప్రశ్నించారు. ఎన్‌టి ఆర్ మద్యపాన నిషేధం చేస్తే దాన్ని ఎత్తేసింది చంద్రబాబు కాదా అని ప్రశ్నించారు. దిక్కు తోచక, అధికారం కోసం, నీతి నియమాలకు తిలోదకాలు ఇచ్చింది టిడిపి కాదా అని ప్రశ్నించారు. ఎన్ని రాజకీయ పార్టీలు అండతో పోటీ చేసినా అధికారంలోకి వచ్చేది వైసిపి ప్రభుత్వమేనని అన్నారు. జీవో 1పై రగడం చేయడం సరికాదన్నారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు పోలీస్ వారిపట్ల చులకనగా మాట్లాడాన్ని ఖండిస్తున్నామన్నారు.

ధాన్యం కొనుగోలుపై ఆందోళనొద్దు

మరో లక్ష టన్నులు సేకరిస్తున్నాం : జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో రైతులు ధాన్యం సేకరణపై దిగులు చెందాల్సిన పనిలేదని, ఇప్పటికే రైతుభరోసా కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణను తిరిగి ప్రారంభించామని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ఒక ప్రకటనలో చెప్పారు. పౌరసరఫరాల కార్పొరేషన్ ద్వారా ఒక యాప్‌ను రూపొందించి రైతుల వద్ద ఇంకా మిగిలి ఉన్న ధాన్యంపై వివరాలు సేకరించగా లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం ఇంకా సేకరించాల్సి ఉందని నిర్ధారణకు వచ్చామని తెలిపారు. ఈ మేరకు ధాన్యం సేకరణను ఆయా ఆర్‌బికెల ద్వారా ఇప్పటికే ప్రారంభించామని వెల్లడించారు. చిన్న, సన్నకారు రైతుల వద్ద మిగిలి ఉన్న ధాన్యం సేకరణకు తొలి ప్రాధాన్యత ఇస్తామని స్పష్టంచేశారు. తహశీల్దార్, వ్యవసాయ అధికారితో కూడిన మండల కమిటీలు ఆర్‌బికెలను సందర్శించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షించి త్వరగా సేకరణ జరిగేలా చర్యలు చేపడతారని పేర్కొన్నారు. జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజనులో 500 ఆర్‌బికెల ద్వారా ఇప్పటివరకు 2.80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల నుంచి సేకరించామని పేర్కొన్నారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యానికి గాను రూ.422 కోట్లు చెల్లింపులు చేశామని, గోనె సంచులు, ధాన్యం రవాణా, హమాలీ ఛార్జీలు కూడా చెల్లించామని వివరించారు. ఇంకేమైనా సమస్యలుంటే టోల్ ఫ్రీ నంబరుకు తెలియజేయవచ్చని సూచించారు.

హామీలు నెరవేర్చకుండా ఇళ్ల కూల్చివేత సరికాదు

నిర్వాసిత గ్రామాల్లో టిడిపి, జనసేన నాయకుల పర్యటన

విమానాశ్రయ నిర్వాసిత గ్రామాల్లో పర్యటిస్తున్న టిడిపి, జనసేన నాయకులు

ప్రజాశక్తి -భోగాపురం

ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా, ముందస్తు సమాచారం లేకుండా ఇళ్లను కూల్చివేయడం సరికాదని విమానాశ్రయ నిర్వాసిత గ్రామాల్లోని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం నిర్వాసిత గ్రామాల్లో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కర్రోతు బంగార్రాజు, జనసేన నెల్లిమర్ల నియోజకవర్గం నాయకులు లోకం నాగ మాధవి నిర్వాసిత గ్రామాల్లో పర్యటించి బాధితులతో మాట్లాడారు. నాగ మాధవి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం కూల్చడమే పనిగా పెట్టుకుందని, పరిహారం విషయంలో కూడా పేదలకు ఒక రేటు పెద్దలకు ఒకరేటు ఇచ్చారని అన్నారు. నిర్వాసిత కాలనీలకు వెళ్లిపోండి, డబ్బులు తరువాత చెల్లిస్తామని అధికారులు చెబితే నిర్వాసితులు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. కర్రోతు బంగార్రాజు మాట్లాడుతూ పునరావాస సదుపాయాలు పూర్తిస్థాయిలో కల్పించకుండా ఇళ్ల కూల్చివేయడం ఎంతవరకు సమంజసమని అధికారులను ప్రశ్నించారు. పరిహారం ఇచ్చేంతవరకు కదిలేది లేదని అన్నారు. విమా నాశ్రయం భూముల్లో అనేక అక్రమాలు జరిగాయని, వైసిపి నాయకులు బినామీ పేర్లతో డబ్బులు వేయించుకున్నారని ఆరోపించారు. నిర్వాసితులకు పూర్తిస్థాయిలో న్యాయం చేయాలని, లేదంటే పోరాడుతామని నాయకులు హెచ్చరించారు.

కుష్టు రహిత సమాజానికి కృషి

ప్రజాశక్తి-విజయనగరం

జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం జనవరి 30వ తేదీ నుండి ఫిబ్రవరి 13వ తేదీ వరకు 15 రోజులపాటు కుష్టు వ్యాధి గురించి ప్రజలలో అవగాహన కల్పించేందుకు స్పర్శ్ లెప్రసీ అవగాహన ప్రచార కార్యక్రమం" నిర్వహిస్తున్నామని కలెక్టర్ ఎ.సూర్యకుమారి తెలిపారు. ప్రజలలో కుష్టు వ్యాధి పట్ల అవగాహన కల్పించేందుకు, ముఖ్యంగా కుష్టు వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపకుండా తీసుకోవాల్సిన చర్యలు గురించి అవగాహన కల్పించేందుకు పిహెచ్‌సి వైద్యాధికారుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. సోమవారం స్పందన లో అందుకు సంబంధించిన పోస్టర్లు విడుదల చేసారు. అనంతరం ఆడిటోరియం బయట ఏర్పాటు చేసిన ప్రచార పోస్టర్ పై సంతకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుష్టు అవగాహన ప్రచార కార్యక్రమంలో అందరూ భాగస్వాములై కుష్టు రహిత సమాజం కోసం చేయి చేయి కలుపుదాం అని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో క్షయవ్యాధి నివారణ అధికారి డాక్టర్ జె . రమేశ్వరీ ప్రభు పాల్గొన్నారు.

స్పందనకు 146 వినతులు

ప్రజాశక్తి-విజయనగరం

కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన వినతుల కార్యక్రమంలో ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించి 146 వినతులు అందాయి. వాటిలో రెవెన్యూ విభాగానికి సంబంధించి అత్యధికంగా 109 ఉన్నాయి. ఎక్కువగా పింఛన్ల కోసం, రేషన్ కార్డుల జారీ, ఉపాధి కల్పన, ఉపాధి హామీ బిల్లుల చెల్లింపు ఇతర సమస్యలపై వినతులు అందాయి. జిల్లా కలెక్టర్ ఎ. సూర్యకుమారి, జె.సి మయూర్ అశోక్, డిఆర్‌ఓ గణపతిరావు, ప్రత్యేక ఉప కలెక్టర్లు పద్మావతి, సూర్యనారాయణ, దొర పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ స్పందనలో అందిన వినతులు పెండింగ్ పెట్టకుండా గడువులోగా పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు.

అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి

గ్రామసభలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యులు

కేంద్ర ప్రభుత్వ పథకాలపై పరిశీలన

వేపాడ : మండలంలో బానాది, ఆతవ గ్రామాల్లో కేంద్ర బృందం సోమవారం పర్యటించింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో గ్రామసభలు ఏర్పాటు చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల వివరాలను కేంద్ర బృందం సభ్యులు గిరిజా పాండే, సత్యజిత్ పరిశీలించారు. పింఛన్లు, డ్వాక్రా రుణాలు, అంగన్వాడీల్లో ఇస్తున్న పౌష్టికాహారం, ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి వివరాలను లబ్ధిదారులను అడిగారు. లబ్ధిదారులు ఇచ్చిన సమాధానాలకు వారు సంతృప్తి వ్యక్తంచేశారు. కార్యక్రమాల్లో ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్, ఇఒపిఆర్‌డి సిహెచ్ సూర్యనారాయణ, పిఆర్ జెఇ ఎం.అలీ, బానాది సర్పంచ్ కర్రీ యశోద, ఎంపిటిసి గొంప తులసి, ఆతవ సర్పంచ్ గొంప వేమననాయుడు, పంచాయతీ కార్యదర్శులు ప్రభుదాస్, నానిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

బొబ్బిలి : జగనన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు సిబ్బందికి సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం సచివాలయ, మున్సిపల్ ఉద్యోగులు, వాలంటీర్లతో సమావేశం నిర్వహించారు. పునాదుల స్థాయిలో ఇళ్ల నిర్మాణాలున్న లబ్ధిదారులతో బ్రిక్ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిబ్రవరి 10 నాటికి బ్రిక్ పనులు ప్రారంభించాలని ఆదేశించారు. పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు ప్రతిఒక్కరూ పని చేయాలన్నారు. ఇళ్ల నిర్మాణాల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇళ్ల స్థలాలు ఇప్పించండి

విజయనగరం టౌన్ : తమకు ఇళ్ల స్థలాలు ఇప్పించాలని ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు కలెక్టర్ ఎ.సూర్యకుమారిని కోరారు. నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం సోమవారం కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా వారి కోరిక మేరకు కలెక్టర్ స్పందిస్తూ విఎంఆర్‌డిఎ పథకం ద్వారా ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మువ్వల గంగా ప్రసాద్ రావు, జిల్లా కార్యదర్శి పి చంద్రశేఖర్ రాజు, అసోసియేషన్ ప్రెసిడెంట్ చందక శ్రీనివాసరావు, పట్టణ నాయకులు ఎం.మంగరాజు, బి.భారతి, గంగి రమేష్, జి.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

ఫోక్‌డాన్స్‌లో విద్యార్థినులకు ద్వితీయ స్థానం

విజయనగరం టౌన్ : మహారాజా ప్రభుత్వ సంస్కృత కళాశాల విద్యార్థినులు బెంగుళూరు లోని ప్రముఖ స్వచ్ఛంద సేవా సంస్థ 'ఆర్ట్ ఆఫ్ లివింగ్' ఆధ్వర్యంలో నిర్వహించిన వరల్డ్ ఫోరం ఫర్ ఆర్ట్ అండ్ కల్చర్ కు సంబంధించి ఫోక్ డాన్స్ విభాగంలో ద్వితీయ స్థానం సంపాదించారు. సంస్థ వ్యవస్థాపకులు రవిశంకర్ చేతుల మీదగా బహుమతి స్వీకరించారు. విద్యార్థినులను కళాశాల యాజమాన్యం అభినందనలు తెలిపారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్ చెక్కు అందజేస్తున్న ఝాన్సీలక్ష్మి

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ప్రజాశక్తి-విజయనగరం

సీతం ఇంజినీరింగ్ కళాశాలలో గత సంవత్సరం విద్య లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన 30 మంది విద్యార్థులకు మజ్జి రామారావు, బొత్స గురునాయుడు మెమోరియల్ స్కాలర్ షిప్ ప్రతిభా పురస్కారాలను సోమవారం ప్రదానం చేశారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన సత్య విద్యాసంస్థల కరస్పాండెంట్ బొత్స ఝాన్సీలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులంతా క్రమశిక్షణతో మెలగి, చదువు పట్ల శ్రద్ధ కనబర్చి చక్కని జీవితానికి సోపానం వేసుకోవాలని సూచించారు. విద్యార్థులంతా ప్రాంగణ నియామకాలపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ మజ్జి శశిభూషణ రావు, అనురాధ, బొత్స పూజిత, కళాశాల ప్రిన్సిపాల్ డి.వి.రామ్మూర్తి, ప్రిన్సిపాళ్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి టిడిపి సాయం

నెల్లిమర్ల : జరజాపుపేట 18వ వార్డుకు చెందిన కొండలవీధిలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన కొండల ప్రభావతి కుటుంబానికి పట్టణ టిడిపి అధ్యక్షులు బైరెడ్డి లీలావతి ఆధ్వర్యంలో యువ నాయకులు కాళ్ళ రాజ శేఖర్ నిత్యావసర వస్తువులు, బట్టలను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా లీలావతి మాట్లాడుతూ నిర్వాసిత కుటుంబాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకొని నష్టపరిహారం చెల్లించి శాశ్వత గృహ నిర్మాణం చేయాలని కోరారు. విపత్తులు ఎక్కడ జరిగినా టిడిపి బాధిత కుటుంబాలను ఆదుకొని వారికి అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి ఉపాధ్యక్షులు బోలె కృష్ణ మూర్తి, టిఎన్‌టియుసి పార్లమెంట్ కార్యదర్శి కిల్లంపల్లి కృష్ణారావు, నాయకులు బోలె సన్యాసప్పడు, ఎస్‌సి సెల్ కార్యదర్శి మాత గోపి, గాడు అప్పారావు, తెలుగు యువత పట్టణ అధ్యక్షులు బైరెడ్డి కళ్యాణ్, మద్దిల రాంబాబు, కాళ్ళ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపిల జిల్లా కమిటీ ప్రమాణ స్వీకారం

విజయనగరం రూరల్ : ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం విశాఖ జిల్లా గోపాలపట్నం కుమారి ఫంక్షన్ హాల్‌లో ఉత్తరాంధ్ర అరు జిల్లాల నుండి ఎన్నికైన గ్రామీణ వైద్యుల సంఘం జిల్లాల వారి ప్రమాణ స్వీకారం జరిగింది. విజయనగరం జిల్లా నుంచి అధ్యక్షులుగా చిరంజీవి, కార్యదర్శులు పైడిరాజు, కోశాధికారి ఉమాశంకర్ నూతన కమిటీతో జోనల్ న్యాయ సలహాదారులు కెపి దేశాయ్ ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి బాబ్జీ, ఫెంపా నాయకులు డాక్టర్ ఎన్ ఎల్ రావు, జోనల్ వ్యవస్థాపక అధ్యక్షులు జంగం జోషి జోనల్, సలహాదారులు మమ్ములు తిరుపతిరావు చేతుల మీదుగా విజయనగరం జిల్లాకు సంబంధించిన సంఘ పత్రాలను జిల్లా కమిటీకి అందజేశారు. ఫెడరేషన్ కార్యవర్గ సభ్యులు వి గౌరినాయుడు జిల్లా నాయకులు రామ్మూర్తిరాజు, ముత్యాలరావు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం నాయకులు

అనధికార చిట్టీలు నిర్వహిస్తే చర్యలు : ఎస్‌పి

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో అనధికారికంగా చిట్టీలు నిర్వహించినా, ఆయా చిట్టీ నిర్వాహకులకు ఏజంట్లుగా పని చేసినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్‌పి ఎం. దీపిక హెచ్చరించారు. ఇటీవల కాలంలో చిట్టీలు నిర్వహించి, అమాయకులను మభ్య పెట్టి, మోసాలకు పాల్పడుతున్న సంస్థలు, నిర్వాహకులు, ఏజంట్లుపై చట్ట ప్రకారం చర్యలు చేపట్టామన్నారు. ఈ తరహా నేరాలకు బాధ్యులైన వారిని కూడా ఇప్పటికే అరెస్టు చేయడంతోపాటు, మోసాలకు పాల్పడి, సంపాదించిన ఆస్తులను కూడా అటాచ్ చేసామన్నారు. వివిధ రకాల చిట్టీలు, స్కీముల పేరుతో సంబంధిత అధికారుల నుండి ఎటువంటి అనుమతులు పొందకుండా చిట్టీలు నిర్వహించడం, ఆయా సంస్థలకు ఏజంట్లుగా పని చేయడం చట్టరీత్యా నేరమన్నారు. ఇటువంటి ఆర్థిక మోసాలకు పాల్పడే వారిపై ప్రత్యేకంగా దృష్టి సారించామన్నారు. ఇందులో భాగంగా ఎటువంటి అనుమతులు లేకుండా చిట్టీలు నిర్వహించే వారిని, ఆయా చిట్టీలకు ఏజంట్లుగా పని చేస్తున్న వారి సమాచారాన్ని సేకరిస్తున్నామన్నారు. చిట్టీల నిర్వాహకులు ఇచ్చే కమీషనుకు ఆశపడి, ఏజంట్లుగా పని చేయడం, అమాయక ప్రజలను మభ్య పెట్టడం, ప్రలోభ పెట్టడం, ఆయా సంస్థలు, చిట్టీ నిర్వాహకులు పాల్పడే మోసాల్లో భాగస్వామ్యులు కావడమే నన్నారు. ఇటుంటి వారిపై కూడా చట్టరీత్యా చర్యలు చేపడతామని తెలిపారు.

స్పందనలో బాధితురాలి సమస్యలు వింటున్న ఎస్‌పి దీపిక, డిఎస్‌పి శ్రీనివాసరావు

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన వారిపై ప్రత్యేక డ్రైవ్

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా, మద్యం సేవించి వాహనాలు నడిపిన చర్యలు తప్పవని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిని ఎస్‌పి హెచ్చరించారు. ప్రత్యేక డ్రైవ్ ద్వారా జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు దాడులు నిర్వహించి, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన వారిపై 120 కేసులు, మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై 19 కేసులు నమోదు చేశారని తెలిపారు.

స్పందన ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం

స్పందనలో వచ్చిన ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం చేయాలని ఎస్‌పి ఎం.దీపిక పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత పోలీసు అధికారులతోవీడియో కాన్ఫరెన్సులో మాట్లాడి, వాటిని పరిష్కరించేందుకు చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో విజయనగరం ఇన్‌ఛార్జి డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు, సిఐలు జె.మురళి, రుద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

చనిపోయిన వారి పింఛన్లు అధికారులకే

సామాజిక తనిఖీల్లో వెలుగులోకి

ప్రజాశక్తి -భోగాపురం

చనిపోయిన వారి పింఛన్లు డ్రా చేసినట్లు సామాజిక తనిఖీల్లో గుర్తించారు. మండలంలోని సాయివలస పంచాయతీకి చెందిన లంక సత్యమమ్మ, ఉడికిల బోడేసు, ఇజ్జిరోతు నారాయణ, తుంపల్లి రాములకు చెందిన రూ.10వేలు డ్రా చేసినట్లు అధికారులు గుర్తించారు. 2022 జూన్‌లో మృతి చెందిన వీరి పింఛన్లు 2022 డిసెంబర్‌లో డ్రా చేసినట్లు వెలుగు చూసింది. సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం ఆవరణంలో 16 విడత సామాజిక తనిఖీలు ఎంపిపి ఉప్పాడ అనూష, జిల్లా నీటి యాజమాన్య సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జగన్నాథం, ఆధ్వర్యంలో నిర్వహించారు. 650 పనులకు గాను రూ.17.2కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. కొంతమంది ఆశా కార్యకర్తలు కూడా పింఛన్లు తీసుకుంటున్నట్లు సామాజిక తనిఖీలు వెలుగు చూసింది. వాటి రికవరీకి ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ డి.బంగారయ్య, ఎపిడి, వైసిపి మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణ, ఎపిఒ ఆదిబాబు, టెక్నికల్ అసిస్టెంట్లు ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

ఫుడ్‌బ్యాంకులు అన్నార్తులకు ఉపయోగకరం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో ఏర్పాటైన ఫుడ్ బ్యాంకులు అన్నార్తులకు ఎంతో ఉపయోగంగా ఉన్నాయని శాసన మండలి సభ్యులు పి.సురేష్ బాబు అన్నారు. ఆయన కుటుంబ సభ్యులైన ఎన్‌వి రమణ రాజు జయంతిని పురస్కరించుకుని నాలుగు ఫుడ్ బ్యాంకులకు ఎమ్మెల్సీ సురేష్ బాబు ఆహారాన్ని అందించారు. ఆయనే స్వయంగా పేదలకు అన్నాన్ని వడ్డించి ఆకలి తీర్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పండగలు, శుభకార్యాలు, ప్రత్యేక దినాల్లో పేదలకు ఆహారాన్ని సమకూర్చడం మంచిదని అన్నారు. జిల్లా కేంద్రంలో అనేక ప్రాంతాల నుంచి వివిధ పనుల కోసం వస్తూ ఉంటారని అటువంటి వారికి ఆహారం అందుబాటులో ఉంటే శ్రేయస్కరంగా భావించి డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి ఫుడ్ బ్యాంక్ లను ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో యాదవ సంఘం రాష్ట్ర ప్రతినిధి ఇప్పిలి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వ్యకాస జిల్లా అధ్యక్షులు అప్పారావు

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి-కొత్తవలస

సంతపాలెం ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జి.అప్పారావు అధికారులను కోరారు. సోమవారం ఆ గ్రామంలో ఉపాధి కూలీలతో ఆయన మాట్లాడి, సమస్యలు తెలుసుకున్నారు. రాజకీయ వివాదంతో వారం రోజులుగా మేట్ల నియామకంలో సమస్య ఉన్నప్పటికీ, సంబంధిత అధికారులు చొరవ చూపకపోవడంపై ఆయన మండిపడ్డారు. ఎపిఒ విజయలక్ష్మి చొరవ చూపినా సమస్య పరిష్కారం కాలేదని చెప్పారు. ఈ సమస్య మరింత జఠిలం కాకముందే జిల్లా ఉన్నతాధికారులు దృష్టిసారించాలని అప్పారావు కోరారు.

గాంధీకి ఘన నివాళి

ప్రజాశక్తి-బొబ్బిలి

మహాత్మా గాంధీ వర్ధంతిని జిల్లా వ్యాప్తంగా సోమవారం ఘనంగా నిర్వహించారు. బొబ్బిలిలో గాంధీబొమ్మ సెంటర్‌లో మహాత్ముని విగ్రహానికి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు పూలమాల వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చెలికాని మురళీకృష్ణ, వార్డు కౌన్సిలర్లు చోడగంజి రమేష్ నాయుడు, పాలవలస ఉమాశంకర్, బొత్స రమణమ్మ, జెఎస్‌సి కన్వీనర్ రేజేటి ఈశ్వరరావు, ఎఎంసి డైరెక్టర్ అల్లు త్రినాథరావు, కోఆప్షన్ సభ్యులు రియాజ్‌ఖాన్ పాల్గొన్నారు. నారాయణప్పవలస పాఠశాలలో హెచ్‌ఎం జెసి రాజు ఆధ్వర్యాన గాంధీ విగ్రహం వద్ద నివాళు లర్పించారు.

శృంగవరపుకోట : పట్టణంలోని కోర్టులో జూనియర్ సివిల్ జడ్జి సబ్బవరపు వాణి జాతిపితకు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కోర్టు సూపరింటెండెంట్ సంపత్, ఉద్యోగులు పాల్గొన్నారు. వాసవి క్లబ్ యూత్ ఆధ్వర్యంలో గాంధీ పార్కులో మహాత్ముని విగ్రహానికి నివాళులర్పించారు. ఆర్‌ఎంపిల సంఘం జిల్లా కోశాధికారి పి.కనకాచారి.. గాంధీ బొమ్మ సెంటర్ వద్దనున్న గాంధీ విగ్రహానికి పూలమాల వేశారు. ధర్మవరం హైస్కూల్లో, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గాంధీజీకి ఘన నివాళులర్పించారు.

నెల్లిమర్ల : సాధన యువజన సంఘం ఆధ్వర్యంలో ఎస్‌సి కాలనీ ప్రాథమిక పాఠశాలలో సోమవారం మహాత్మా గాంధీ వర్ధంతి నిర్వహించారు. మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి శ్రందాంజలి గటించి దేశ సేవలో ఆయన పాత్రని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రామారావు, ఇతర సిబ్బంది, సాధన యువజన సంఘం ఉపాధ్యక్షుడు బెల్లాన వెంకటరావు, ప్రధాన కార్యదర్శి పసుమర్తి వెంకటరమణ, సభ్యులు శీల చిరంజీవి, విద్యార్థులు పాల్గొన్నారు.



గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు

గాంధీ ఆశయసాధనకు కృషి

మెంటాడ : మెంటాడ కెజిబివిలో గాంధీ చిత్రపటానికి జెవివి జాతీయ ఉపాధ్యక్షులు గంద్రేటి అప్పలనాయుడు, ఎంపిడిఒ పి.త్రివిక్రమరావు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కెజిబివి ప్రత్యేక అధికారి శారద, జెవివి నాయకులు రెడ్డి రాజగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

పరదేశమ్మ జాతర ప్రారంభం

ప్రజాశక్తి- వేపాడ

మండలంలోని వావిలపాడు గ్రామంలో సోమవారం పరదేశమ్మ జాతర ప్రారంభమైంది. ఈ సందర్భంగా అమ్మవారి విగ్రహాన్ని డప్పు వాయిద్యాలు, మందు గుండు సామగ్రి, కాంగో డాన్సలతో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలకు ఎంపిపి డి.సత్యవంతుడు చేతుల మీదుగా నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బీల రాజేశ్వరి, వైసిపి మండల అధ్యక్షులు జగ్గు బాబు, వైసిపి నాయకులు బి.సతీష్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పరదేశమ్మ ఆలయం వద్ద జన కోలాహలం

సచివాలయ వ్యవస్థతోనే సుపరిపాలన

ఎమ్మెల్యే కంబాల జోగులు

ప్రజాశక్తి-రేగిడి

సచివాలయ వ్యవస్థ తోనే మెరుగైన సుపరి పాలన అందుతోందని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. సోమవారం నాయరాలవలస, వెంకట రంగారాయపురం గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు.. ముందుగా సంక్షేమ పథకాల పుస్తకాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను సచివాలయాల ద్వారా అందిస్తున్నామన్నారు. గత ప్రభుత్వాలు అమలు చేయని సంక్షేమ పథకాలను నేడు వైసిపి ప్రభుత్వం అందిస్తోందన్నారు. అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన, తెల్ల రేషన్ కార్డులు, పెన్షన్లు, జగనన్న కాలనీలు తదితర పథకాలతో ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ గన్నవరపు కాశీ విశ్వనాథరావు, తహశీల్దార్ టి.కళ్యాణ చక్రవర్తి, వైస్ ఎంపిపిలు టంకాల అచ్చెం నాయుడు, వావిలపల్లి జగన్మోహన్‌రావు, వైసిపి నాయకులు నెల్లి పెంటన్నాయుడు, కెంబూరు వెంకటేశ్వరరావు, పాలవలస, కరణం శ్రీనివాసరావు, అప్పలనాయుడు, సోషల్ మీడియా కన్వీనర్ మజ్జి శ్రీనివాసరావు, జెఇ రామకృష్ణ , పలువురు అధికారులు, నాయకులు, పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కంబాల

స్పర్శ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యశాఖ సిబ్బంది

ప్రజాశక్తి - జామి

కుష్టి వ్యాధిగ్రస్తులను గుర్తించి, అవగాహన సదస్సులు నిర్వహించి స్పర్శ కార్యక్రమాలను జయప్రదం చేయాలని పిహెచ్‌సి వైద్యాధికారి ఎస్.భాగ్యరేఖ కోరారు. సోమవారం స్పర్శ కార్యక్రమంపై జామి పిహెచ్‌సిలో అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా కుష్టి వ్యాధి నిర్మూలనకు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్పర్శ లేని, రాగి రంగు మచ్చలను గుర్తించే సర్వేను వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య అవగాహన అధికారి అనిల్ ప్రేమ్ కుమార్, హెల్త్ సూపర్వైజర్లు భవాని, సత్యనారాయణ, ఎఎన్‌ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

వేపాడ : బొద్దాం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్పర్శ కార్యక్రమంపై వైద్యాధికారి సతీష్ కుమార్ అవగాహన కల్పించారు. వేపాడ పిహెచ్‌సిలో వైద్యాధికారి ఎ.ధరణి.. సిబ్బందికి స్పర్శ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. కుష్టి వ్యాధిగ్రస్తులను గుర్తించి నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో సిహెచ్‌ఒ ఆంజనేయులు, హెల్త్ సూపర్వైజర్ ఎంవై రమణ, హెల్త్ అసిస్టెంట్ డి.సత్యనారాయణ, ఎఎన్‌ఎం ఎన్.ముత్యాలమ్మ పాల్గొన్నారు. అనంతరం బక్కునాయుడుపేట వద్దనున్న కెజిబివిలో బాలికలకు అవగాహన కల్పించారు.

ఇ-వాహనాలను పరిశీలిస్తున్న దాట్ల కృష్ణకుమారి

సెంచూరియన్‌లో సదుపాయాలు భేష్

ప్రజాశక్తి-నెల్లిమర్ల

సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో సదుపాయాలు బాగున్నాయని మనోమే కన్సల్టెన్సీ సర్వీసెస్ సంస్థ సిఇఒ దాట్ల కృష్ణకుమారి కితాబునిచ్చారు. సోమవారం మనోమే సంస్థ ప్రతినిధులు విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఇక్కడ ఎఆర్ విఆర్ ప్రయోగశాల, డ్రోన్ తయారీ, ఇ-వాహనాల తయారీ, టిష్యూ కల్చర్ తదితర వాటిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ త్వరలోనే సెంచూరియన్ విశ్వవిద్యాలయంతో ఎంఒయు కుదుర్చుకుంటామన్నారు. తమ సంస్థ తరపున ఇక్కడ ప్రాంగణ ఎంపికలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. తమ సంస్థ భారత్‌తో పాటు అమెరికా, యునైటెడ్ కింగ్ డామ్, ఆస్ట్రేలియా, కరేబియన్ దేశాలలో సేవలు అందిస్తుందని తెలిపారు. అనంతరం ఆమెను వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్‌ఎన్ రాజు సత్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పిఎస్‌వి రమణారావు, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్‌ఎస్ వర్మ, డీన్ సన్నీ డియోల్, డీన్ ప్రొఫెసర్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై కమిషనర్ ఆరా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

14వ ఆర్థిక సంఘం నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులపై కమిషనర్ ఆర్ శ్రీ రాములనాయుడు ఇంజినీరింగ్ అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా 14వ ఆర్థిక సంఘం నిధులు పనులు ఏ మేరకు చేరుకున్నాయి, మిగిలి ఉన్న పనులు ఎన్ని, వాటి ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన పనులు పూర్తయ్యే విధంగా చూడాలని ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశించారు. సమావేశంలో ఇఇ కె.శ్రీనివాసరావు, ఎఇలు వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రజారోగ్య విభాగం అధికారులతో సమీక్ష నిర్వహించారు. యూజర్ ఛార్జీలు, ఇంటింటి చెత్త సేకరణ, ప్లాస్టిక్ నిషేధం అమలు వంటి అంశాలపై చర్చించారు. మెరుగైన పారిశుధ్య విధానానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. సమావేశంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ సత్యనారాయణ, పారిశుధ్య పర్యవేక్షకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీరాములునాయుడు

డ్రైవర్ల కుటుంబాలకు కౌన్సిలింగ్

శృంగవరపుకోట : రహదారి భద్రతా వారోత్సవాలలో భాగంగా సోమవారం పట్టణంలోని ఆర్‌టిసి డిపో పరిధిలో ఎనిమిది మంది డ్రైవర్ల కుటుంబాలకు డిపో మేనేజర్ కె.రమేష్ కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ ప్రతి కుటుంబానికి పండ్లు అందజేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సూపరింటెండెంట్ వెంకట్రావు, డిప్యూటీ సూపరింటెండెంట్ సన్నిబాబు, డిపో సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌బికెల పరిశీలన

సీతానగరం : మండలంలోని పెదబోగిలి, బుడ్డిపేట రైతు భరోసా కేంద్రాలను సోమవారం ఎంపిడిఒ బి. కృష్ణమహేశ్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు రైతులు వద్దనున్న ధాన్యం బస్తాలు ఎంతవరకు ఉన్నాయి? కళ్లాలు, పొలాల్లో వరిచేను కుప్పలు ఆయా గ్రామాల్లో ఉండే రైతుల వివరాలను సేకరించి అనంతరం ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు.

దుర్గా ప్రసాద్‌కు జాతీయ పురస్కారం

ప్రజాశక్తి- నెల్లిమర్ల

జరజాపు పేటకు చెందిన సాధన యువ జన సంఘం అధ్యక్షుడు పోలుబోతు దుర్గా ప్రసాద్‌కి సంక్రాంతి జాతీయ పురస్కారం దక్కింది. సోమవారం తెలంగాణ రాష్ట్రం వరంగల్‌లో కన్నతల్లి ఫౌండేషన్, కె.రాజన్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన సంక్రాంతి జాతీయ పురస్కారాల్లో భాగంగా దుర్గా ప్రసాద్‌కి పురస్కారం అందజేశారు. సమాజమే దేవాలయం, మానవ సేవ మాధవ సేవ అనే భావంతో సమాజానికి తమ వంతుగా ఉత్తమ సేవలు అందించిన సాధన యువజన సంఘం అధ్యక్షుడుగా దుర్గా ప్రసాద్ వివిధ సేవా కార్యక్రమాలు చేయడమే కాకుండా రక్త దానమే ప్రాణ దానం అనే స్పూర్తితో తన మిత్రులు అందరితో కలిసి రక్త దాన శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే 57 సార్లు రక్త దానం చేసిన పోలుబోతు దుర్గాప్రసాద్‌కు ఈ అవార్డు రావడంతో పలువురు అభినందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మరుపల్లి రవి, మహబూబాబాద్ చైల్డ్ వెల్ఫేర్ చైర్ పర్సన్ డాక్టర్ ఎస్. నాగమణి, అభ్యుదయ ప్రిన్సిపాల్, రిటైర్డ్ ప్రొఫెసర్, ఆయుర్వేదిక్ వైద్యులు రామారావు, భక్తరామదాసు తరం వారసులు కంచర్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.